నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 6 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

# వైభవంగా నాగుల చవితి

మంచిర్యాల అర్బన్, నవంబర్ 5 : జిల్లా కేంద్రంలో మంగళవారం నాగుల చవితి వేడుకలను మహిళలు వైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమిలో మొదటగా వచ్చిన నాగుల చవితి సందర్భంగా మహిళలు ఉదయమే ఆలయాలకు చేరుకొని పూజలు చేశారు. హమాలీవాడ, కట్టపోచమ్మ, గౌతమీనగర్, రెడ్డి కాలనీ, హైటెక్‌సిటీ, ఎల్ఐసీ కాలనీ, రాంనగర్, ఎన్‌టీఆర్‌నగర్‌లో పెద్ద సంఖ్యలో తరలివచ్చి కొబ్బరికాయలు కొట్టి, పుట్టల్లో పాలుపోసి దీపాలు వెలిగించారు. నాగదేవతకు నైవేద్యాలు సమర్పించారు. కుటుంబమంతా సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు.

సాండ్‌గాం రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే

# ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

- కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి
- ఇతర రాష్ట్రాల నుంచి సన్నరకం వడ్లు రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి
- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కౌటాల, నవంబర్ 5 : ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని, ఇందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం సాండ్‌గాం గ్రామంలోని రైతు వేదికలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సహకార శాఖ అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ఈ నెల 15వ తేదీ తర్వాత ధాన్యం వచ్చే అవకాశమున్నందున అధికారులు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చే ముందు తప్ప, తాలు, తేమ లేకుండా నిబంధనల ప్రకారం తీసుకురావాలన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇస్తుందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, కేంద్రానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి సన్న రకం వడ్లు రాకుండా సరిహద్దు ప్రాంతాలైన వాంకిడి, హుడ్కిలి, వెంకట్రావ్‌పేట, గూడెం వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని, మండల ప్రత్యేక అధికారులు కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావు, ఏడీఏ మనోహర్ ఉన్నారు.

## పులి దాడిలో మృతి చెందిన పశువుల యజమానికి పరిహారం

కాసిపేట : చెక్కు అందిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కాసిపేట/లక్షెట్టిపేట, నవంబర్ 5 : ముత్యంపల్లి ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో పెద్ద పులి, చిరుత పులి దాడిలో మృతి చెందిన ఆవుల యజమానికి మంగళవారం మంచిర్యాల అటవీశాఖ కార్యాలయంలో అధికారులు చెక్కులు అందించారు. గోండుగూడెం రైతు చిత్రుకు చెందిన మూడు ఆవులు ఆదివారం సాయంత్రం లక్షెట్టిపేట రేంజ్‌లోని మేడారం సెక్షన్ పరిధిలో మేతకు వెళ్లగా పెద్ద పులి, చిరుత దాడిలో మృతి చెందాయి. లక్షెట్టిపేట ఎఫ్ఆర్వో సుభాష్, ముత్యంపల్లి సెక్షన్ డిప్యూటీ రేంజర్ ప్రవీణ్‌నాయక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పశు వైద్యాధికారి తిరుపతి పంచనామా నిర్వహించి, వాటి విలువ రూ.39 వేలుగా నిర్ణయించగా, మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్, డీఎఫ్‌వో, కవ్వాల్ ఎఫ్‌డీపీటీ సూచన మేరకు బాధిత రైతు చిత్రుకు చెక్కును అందించారు. అటవీ శాఖ చరిత్రలోనే మృతి చెందిన ఆవులకు 24 గంటల్లోగా సాయాన్ని అందించ డం గమనార్హం. మేడారం ఎఫ్ఎస్‌వో అహ్మ ద్ అలీ, ఎఫ్‌బీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గురువాపూర్ అడవుల్లో పెద్దపులి, చిరుత సంచారం

పెద్దపులి, చిరుత పులి సంచరించే ప్రాంతంలో వివరాలు సేకరిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కాసిపేట, నవంబర్ 5 : గురువాపూర్ శివారులోని అటవీ ప్రాంతంలో పెద్దపులి, చిరుత కొన్ని రోజులుగా సంచరిస్తున్నాయి. రెండేళ్లుగా చిరుత పులి సంచారం ఉండగా, వారం నుంచి పెద్దపులి ఈ ప్రాంతంలో తిరుగుతున్నట్లు తెలిసింది. గురువాపూర్ అటవీ ప్రాంతానికి ఆనుకొని కవ్వాల్ విస్తరించి ఉండడంతో ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకునేందుకు పెద్దపులి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తున్నది. పెద్దపులి, చిరుత పులి ఒకదాని సమీపంలోనే మరొకటి తిరుగుతున్నట్లు వాటి పాద ముద్రల ఆధారంగా అధికారులు గుర్తించారు. అటవీ ప్రాంతానికి ఎవరూ వెళ్లకూడదని, చిరుత పులి, పెద్దపులి కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఫారెస్ట్ అధికారులు

పులి పాద ముద్రలు

కోరుతున్నారు. ఆవులు, మేకలపై దాడులు చేస్తే పరిహారం అందిస్తామని తెలిపారు. కాగా, ఇటీవల లక్షెట్టిపేట ఏరియాలో మూడు ఆవులపై పులులు దాడి చేసి చంపాయి. ఒక ఆవును పూర్తిగా తినగా, మిగతా రెండు ఆవులను రేసు కుక్కలు లాక్కొని వెళ్లినట్లు అధికారులు గుర్తించారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నస్పూర్, నవంబర్ 5 : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఏవోకు, విద్యాశాఖ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వరి, రఫియా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 8 నెలలుగా కోడిగుడ్ల బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. అలాగే మెనూ చార్జీలు పెంచాలని, గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు రుబియా, లక్ష్మి, సరిత పాల్గొన్నారు.

# ఖాళీ జాగా.. వేసెయ్ పాగా..!

## బెల్లంపల్లి మున్సిపాలిటీలో జోరుగా కబ్జాలు, అక్రమ నిర్మాణాలు

- అధికారులు, నాయకుల అండదండలు
- కాసులకు కక్కుర్తి పడి ఇంటి నంబర్లు
- కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తూ బహుళ అంతస్తులు

బెల్లంపల్లి పురపాలక సంఘం కార్యాలయం

బెల్లంపల్లి, నవంబర్ 5 : బెల్లంపల్లి మున్సిపాలిటీ అక్రమ నిర్మాణాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నది. ఇటీవల సింగరేణి సంస్థకు సంబంధించిన స్థలాలను సర్కారుకు అప్పగించగా, అప్పటి నుంచి కబ్జాలు, అక్రమ కట్టడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు స్వాహా చేయడం.. ఆపై మున్సిపల్ అధికారులు, నాయకులను ప్రసన్నం చేసుకొని శాశ్వత నిర్మాణాలు చేపట్టడం ఇక్కడ పరిపాటిగా మారుతున్నది. బెల్లంపల్లి కన్నాల ఫ్లై ఓవర్‌బ్రిడ్జి నుంచి మొదలుకొని.. కొత్తబస్టాండ్, పాత బస్టాండ్, బజార్ ఏరియా, కాంటా ఏరియా, ఏఎంసీ, కాల్‌టెక్స్ వరకు ఇదే తంతు కొనసాగుతున్నది.

### ఎక్స్‌ప్లోరేషన్ విభాగానికి ఇరువైపులా..

సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్ విభాగానికి ఇరువైపులా ప్రహరీని ఆనుకొని తాత్కాలిక నిర్మాణాలు వెలిశాయి. దీంతో పాటుగా సింగరేణి కళావేదికను ఆనుకొని మున్సిపాలిటీ అధికారులు ఏర్పాటు చేసిన స్ట్రీట్ వైండర్స్‌కు ఇరువైపులా కబ్జా చేసి తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. తాజాగా ఇటీవల అదే స్థలంలో పెద్ద ఎత్తున రెండు షటర్లు వేయడానికి యత్నించడం వివాదాస్పదంగా మారింది. ఈ కబ్జాలో వేలాది రూపాయలు మున్సిపల్, ప్రజాప్రతినిధులకు చేతులు మారాయని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లడంతో కంటితుడుపు చర్యగా సోమవారం వాటిని తొలగించారు. ఎస్‌బీఐ బ్యాంకు నుంచి రాంనగర్ వరకు ఉన్న నాళా చుట్టూ పక్కల స్థలం కబ్జాకు గురైంది. మార్కెట్ ఏరియాలో ఈ కాలువ పక్కన స్థలాన్ని ఆక్రమించి ఓ మద్యం దుకాణానికి అద్దెకు ఇచ్చారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదే విధంగా ఈ కాలువను ఆనుకొని మరిన్ని అక్రమ నిర్మాణాలు ఏర్పాటు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ఏదైనా విపత్తు సంభవిస్తే బాధ్యులు ఎవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### తాత్కాలిక నిర్మాణాలకు ఇంటి నంబర్లు

బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఎక్కడా లేనివిధంగా తాత్కాలిక నిర్మాణాలకు కూడా ఇంటి నంబర్లు కేటాయించడం సంచలనంగా మారింది. పండ్ల దుకాణాలు, ఇతర నిర్మాణాలకు డబ్బులు దండుకుని ఇంటి నంబర్లు అప్పనంగా ఇస్తున్నారు. సామాన్యుడు ఇంటి నంబర్ తీసుకోవాలంటే సవాలక్ష నిబంధనలు పెట్టే అధికారులు.. ఈ అక్రమార్కులకు మాత్రం రాత్రికి రాత్రే ఇంటి నంబర్లు కేటాయించడం విమర్శలకు తావిస్తున్నది. మున్సిపల్ అధికారులు, పట్టణ, బస్తీ నాయకుల అండదండలతోనే ఈ తంతంగం నడుస్తుందనే చర్చ సాగుతున్నది. ఒక్కో ఇంటి నంబర్‌కు రూ. 10 వేల నుంచి రూ. 30 వేల వరకు చేతులు మారుతున్నట్లు తెలుస్తున్నది. ఎస్‌బీఐ బ్యాంకు ముందు స్థలం మొత్తం కబ్జాకు గురైంది. మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ బ్యాంకు వెనకాల లారీ యార్డు ఉండేది. రెండు లారీలు ఒకేసారి రాకపోకలు సాగించేలా ఉన్న ఈ స్థలం అంతా కబ్జాకు గురైంది. హోటళ్లు, పలు దుకాణాలు, ఇతర అక్రమ నిర్మాణాలతో ఇరుకుగా మారింది. ఈ స్థలం అంతా కబ్జాకు గురికావడంతో బ్యాంకుకు ఆటో వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ లక్షల్లో అడ్వాన్సులు, వేలల్లో అద్దెలు వసూలు చేస్తున్నారు. ఈ కబ్జాల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయని తెలుస్తున్నది. పాత బస్టాండ్ స్థలం కూడా కబ్జాకు గురైంది. దీంతో పార్కింగ్ సమస్య కూడా ఉత్పన్నమవుతున్నది.

### ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ముందు కబ్జా

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం నిర్మాణానికి ముందు కూరగాయల వ్యాపారస్తులకు పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట విక్రయాలు చేసుకోవడానికి స్థలం కేటాయించారు. అయినా కొంతమంది బడా వ్యాపారులు బెల్లంపల్లి బస్తీకి వెళ్లే దారిలో మార్కెట్ ముందు మెయిన్‌రోడ్డు పక్కన అప్పట్లో తాత్కాలిక నిర్మాణాలు వేసుకుని క్రమక్రమంగా శాశ్వత కట్టడాలు సైతం చేపట్టారు. వీటికి ఇంటి నంబర్లు కూడా తీసుకోవడం గమనార్హం. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం పూర్తయి ప్రారంభమైనా కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని తొలగించడంలో మీనామేషాలు లెక్కిస్తున్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. సింగరేణి బంకర్ స్థలంలో వేసిన తాత్కాలిక షెడ్లను రేపు,మాపు తొలగిస్తామంటూ దాట వేస్తున్నారే తప్ప.. ఆ దిశగా ఎటువంటి కార్యాచరణ రూపొందించడం లేదన్నా విమర్శలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని మున్సిపల్ అధికారులు ప్రకటనలు చేస్తూ జాప్యం చేస్తున్నారే తప్ప అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

### కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

మున్సిపాలిటీలో జీప్లస్ 2 భవనాలకు మాత్రమే అనుమతులున్నాయి. అంతకుమించి అంతస్తులకు సీడీఎంఏ అనుమతులు తీసుకోవాలని మున్సిపల్ నిబంధనలు చెబుతున్నా పట్టణంలో యథేచ్ఛగా బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఇటీవల విస్తృతంగా బెల్లంపల్లిలో పర్యటించిన సమయంలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాల విషయం ఆయన దృష్టికి వచ్చింది. మున్సిపల్ అధికారులకు సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. సీడీఎంఏ అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తున్న యజమానులకు వెంటనే నోటీసులు అందించి జరిమానా విధించాలని ఆదేశించారు. అయినా మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలకు ఉపక్రమించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోల్ బేరింగ్ ఏరియా కావడంతో బెల్లంపల్లి మున్సిపాలిటీలో సెల్యూలార్‌కు అనుమతి లేదు. అయినా బజార్ ఏరియా, నెల్కోలైన్, క్రిష్ణమందిర్ లైన్, ఇతర ఏరియాలలో సెల్యూలార్‌లను నిర్మిస్తున్నారు.

**అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం..**

పట్టణంలో అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమనిర్మాణాలను తొలగిస్తాం. టీపీవో సంబంధిత సిబ్బంది లేకపోవడంతో తొలగించడంలో జాప్యం జరుగుతోంది. నిబంధనలు ఉల్లంఘించి ఇంటి నంబర్లు ఇచ్చిన వాటిపైనా విచారణ జరుపుతున్నాం. టాస్క్‌ఫోర్సు సాయంతో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతాం.

**- శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్**

మందమర్రిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం దేవేందర్

# కోలిండియా పోటీల్లో సింగరేణి ఖ్యాతిని చాటాలి

- జీఎం దేవేందర్
- మందమర్రిలో సింగరేణి స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

మందమర్రి, నవంబర్ 5 : కోలిండియా స్థాయిలో ప్రతిభ కనబరచి సింగరేణి ఖ్యాతిని చాటాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. మంగళవారం మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు ఏరియా అధికారులు, యూనియన్ నాయకులతో కలసి బెలూన్‌లను వదిలి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జీఎం దేవేందర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియా క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి రోజు మొదటి రౌండ్‌లో ఎల్లందు, మణుగూరు, ఆర్‌జీ-3, భూపాలపల్లి జట్లు తలపడగా ఆర్‌జీ-3, భూపాలపల్లి జట్టు విజయం సాధించింది. రెండో రౌండ్‌లో మందమర్రి, బెల్లంపలి ఏరియా, శ్రీరాంపూర్ ఏరియా జట్లు తలపడగా శ్రీరాంపూర్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సీఎంవోఏఐ అధికారి పైడీశ్వర్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, స్పోర్ట్స్ సమన్వయకర్త సీనియర్ పీవో కార్తీక్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ కార్పొరేట్ పాస్నెట్, స్పోర్ట్స్ సూపర్ వైజర్లు జాన్ వెస్లీ, అశోక్, రమేశ్, శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, కోఆర్డినేటర్ శివ కృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన జేఏసీ నాయకులు

మంచిర్యాలటౌన్, నవంబర్ 5 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మంచిర్యాల కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు ఆర్టీసీ జేఏసీ నాయకులు వినతిపత్రం అందించారు. టీజీఎస్సార్టీసీ జేఏసీ మంచిర్యాల డిపో చైర్మన్ గోళి శంకర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 11 నెలలైనా ఇప్పటి వరకు హామీలు అమలు చేయలేక పోయిందన్నారు. రాష్ట్ర జేఏసీ నాయకత్వం పిలుపు మేరకు అన్నిచోట్ల కలెక్టర్లకు వినతిపత్రాలు

కలెక్టరేట్‌లో వినతిపత్రం అందిస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

సమర్పించడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి గెజిట్ విడుదల అయినందున అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించి జీవో విడుదల చేయాలన్నారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని, వేతన సవరణలు, ఏరియర్స్, అలవెన్స్‌లు అందించాలని, ప్రైవేట్ బస్సులను రద్దుచేసి ఆర్టీసీ సొంతంగా బస్సులను కొనుగోలు చేయాలని, కొత్తగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, మహాలక్ష్మి పథకానికి సంబంధించి ప్రతీనెలా రూ.350 కోట్లు సంస్థకు అందించాలని, మహాలక్ష్మి ప్రయాణికులకు జీరో టికెట్‌కు బదులు ఉచిత పాస్‌లు మంజూరు చేయాలన్నారు. నాయకులు పోలు రాజేశం, బొట్టు లక్ష్మయ్య, ఎల్‌బీ రాములు, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

### ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 5 : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ ఆసిఫాబాద్ డిపో చైర్మన్ దివాకర్, ఏఐటీయూసీ నాయకుడు పిడుగు శంకర్, జేఏసీ నాయకులు అశోక్, మోహన్ బాబు, హరికృష్ణ ఉన్నారు.

# సేంద్రియ సాగుపై దృష్టిపెట్టాలి

**లీగల్‌సెల్ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అర్పిత**

మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అర్పిత

హాజీపూర్, నవంబర్ 5 : రైతు లేకపోతే ప్రపంచం ఆగిపోతుందని లీగల్‌సెల్ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ అర్పిత మారంరెడ్డి అన్నారు. మంగళవారం గుడిపేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రైతులు అధిక మోతాదులో ఫెస్టిసైడ్స్‌ను వినియోగించకుండా సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలు వాడకూడదని తెలిపారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని జాతీయ రహదారి-63లో భూములు కోల్పోతున్న రైతులు న్యాయమూర్తి దృష్టికి తీసుకురాగా, సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సురేఖ, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్‌పాండే, లీగలైడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు ఆర్ ఆర్ రాములు, ఎండీ సంధానీ, రైతులు గోనె శ్యామ్ సుందర్ రావ్, పుస్కూరి శ్రీనివాస రావ్, బొడ్డు శంకర్ ఎరువుల దుకాణాల యజమానులు, ఏఈవోలు పాల్గొన్నారు.

తాండూర్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ రవికుమార్

# యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్
- తాండూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

తాండూర్, నవంబర్ 5 : విద్యార్థులు, యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. మంగళవారం తాండూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. మాదక ద్రవ్యాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, యువత గంజాయి, సిగరెట్, గుట్కావంటివాటికి అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రధాన చౌరస్తాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉండడంతో కొంతమేర సమస్య ఏర్పడుతుందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో సిబ్బందిని నియమిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, తాండూర్ ఎస్ఐ డీ కిరణ్ కుమార్ ఉన్నారు.